నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I హైదరాబాద్, బుధవారం 2 ఏప్రిల్ 2025 VIKARABAD



చెట్లు లేవు.. కానీ కనిపిస్తున్న పల్లె ప్రకృతి వనం బోర్డు

## పేరుకే ప్రకృతివనం.. కనిపించని పచ్చదనం..!

కొడంగల్, ఏప్రిల్ 1 : పల్లెలకు పచ్చటి వాతావరణాన్ని అందించే దిశగా గత కేసీఆర్ ప్రభుత్వం ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేసి గ్రామ ప్రజలకు పట్టణాల్లోని పార్కు వంటి సౌకర్యాలను కల్పించింది. వివిధ రకాల మొక్కలను పెంచడమే కాకుండా వాకింగ్ ట్రాక్, కూర్చోవడానికి బేంచీలు, చిన్న పిల్లలకు ఆడుకునే పరికరాలు వంటి వాటిని అందుబాటులోకి తీసుకొచ్చింది. అప్పట్లో ప్రకృతి వనాలు పచ్చటి అందాలను సంతరించుకొని ఉండేవి, నేడు వాటిపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మొక్కలు ఎండిపోవడం, పల్లె ప్రకృతి వనంలో శుభ్రత లోపించడం వంటివి చోటుచేసుకుంటున్నాయి. కానీ మండలంలోని టేకల్‌కోడ్‌తండాలో బోర్డు కనిపిస్తున్నా మొక్కల జాడ మాత్రం లేదు.

## మహిళల రక్షణలో సర్కారు విఫలం

### కాంగ్రెస్ పాలనలో ఎవరూ సంతోషంగా లేరు : మాజీ మంత్రి సబితారెడ్డి



బడంగ్‌పేట్, ఏప్రిల్ 1 : కాంగ్రెస్ పాలనలో మహిళలకు భద్రత లేకుండా పోయిందని మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రోజురోజుకూ పెరుగుతున్న లైంగిక దాడులు, హత్యలను నివారించడంలో ప్రభుత్వం విఫలమవుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. విదేశీ మహిళలపై దాడులు జరుగుతుంటే ఇక రక్షణ ఎక్కడ ఉందని ఆమె మండిపడ్డారు. నాగర్‌కర్నూల్‌లో జరిగిన ఘటన మరువకముందే మరో మహిళ కామాంధుల కర్కశత్వానికి బలైందన్నారు. హైదరాబాద్ మహానగరంలో నడిబొడ్డున ఒక విదేశీ మహిళపై లైంగికదాడి జరిగితే ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. రేవంత్ చేతగాని పాలనతోనే రాష్ట్రంలో మహిళలపై హింస పెరిగిందని ఆమె విమర్శించారు. రేవంత్ రెడ్డి మహిళలను కోటీశ్వరులుగా మార్చడం కాదు.. ముందు వారి ప్రాణాలు కాపాడాలని కోరారు. జర్మనీ యువతిపై లైంగిక దాడి చేసిన బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు. కాంగ్రెస్ పాలనలో మహిళలకు కన్నీళ్లు తప్పా ఏమీ మిగలలేదన్నారు. కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరని ఆమె పేర్కొన్నారు.

# కొత్తగడి గురుకులం వివాదాలకు నిలయం

- విద్యార్థినులను దుర్భాషలాడుతూ.. కొట్టిన ప్రిన్సిపాల్
- ఫిబ్రవరిలో స్కూల్ భవనం పైనుంచి దూకి విద్యార్థిని ఆత్మాహత్యాయత్నం
- బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థిని తోటి విద్యార్థులతో కొట్టించిన టీచర్
- ప్రిన్సిపాల్ చొరవతో పోలీస్‌స్టేషన్‌లో సద్దుమణిగిన సమస్య
- ఆలస్యంగా వెలుగులోకి వస్తున్న సంఘటనలు
- భయాందోళనకు గురవుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు
- ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న ప్రజలు



వికారాబాద్ కొత్తగడి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల/కళాశాల

వికారాబాద్, ఏప్రిల్ 1 : వివాదాలకు నిలయంగా వికారాబాద్ కొత్తగడి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల/కళాశాల మారింది. గురుకుల పాఠశాలల్లో చక్కటి విద్యాబోధన అందిస్తారనే ఆశతో వచ్చిన విద్యార్థినులకు చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. గురుకుల పాఠశాలలో చదువుకొని గొప్ప స్థాయికి చేరుకోవాలనే ఆలోచనతో ఉన్న విద్యార్థులకు దినదిన గండంగా మారింది. ఈ పాఠశాలలో జరిగిన సంఘటనలు ఆలస్యంగా ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఇటీవల 10వ తరగత విద్యార్థినిని టీచర్ తిట్టడంతో మనోవేదనకు గురై పాఠశాల మొదటి అంతస్తు నుంచి దూకి ఆత్మాహత్యాయత్నం చేసుకున్నది. విద్యార్థుల పట్ల దురుసు ప్రవర్తనను మానుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ హెచ్చరించారు. మరికొన్ని రోజుల తరువాత విద్యార్థినులపై దుర్భాషలాడుతూ.. ప్రిన్సిపాల్ చెంపదెబ్బలు కొట్టి అవమానపరిచారు. గత నెలలో బాలుర పాఠశాలలో 6వ తరగతి విద్యార్థిని టీచర్ కొట్టడంతోపాటు తోటి విద్యార్థులతో కొట్టించింది. దీంతో విద్యార్థికి జ్వరం రావడంతో తల్లిదండ్రులకు సమాచారం అందించి ఇంటికి పంపించారు. టీచర్ కొట్టి.. విద్యార్థులతో కొట్టించిందని విద్యార్థి చెప్పడంతో బాలుర గురుకుల పాఠశాల తీరుపై తల్లిదండ్రులు మండిపడ్డారు. చైల్డ్‌లైన్, పోలీస్ స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేశారు. ప్రిన్సిపాల్ హామీతో సమస్య సద్దుమణిగింది.

### వేధించడంతో ఆత్మహత్యాయత్నం


పాఠశాల పైనుంచి దూకిన విద్యార్థిని(ఫైల్)

వికారాబాద్‌లోని కొత్తగడి గురుకుల పాఠశాలలో ఫిబ్రవరి 24న 10వ తరగతి విద్యార్థిని తబిత చదువులో ముందంజలో ఉండేది. తబిత మంచి అమ్మాయి కాదని స్రవంతి టీచర్ తరచూ వేధించడంతో మనోవేదనకు గురై పాఠశాల మొదటి అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ప్రమాదంలో తబితకు ఎడమ కాలు విరిగింది. దీంతో పాఠశాల సిబ్బందితో ఎవరికీ తెలియకుండా ప్రైవేటు వాహనంలో ప్రైవేటు దవాఖానకు తరలించారు. కొంతసేపటికి తండ్రికి ఫోన్ ద్వారా సమాచారం అందజేశారు. తబితకు కాలు విరగడంతో సిమెంట్ పట్టీ వేశారు. విద్యార్థినితో కలిసి తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి టీచర్లను నిలదీశారు. విద్యార్థి సంఘాలు పాఠశాల నిర్వాకంపై నిరసనలు వ్యక్తం చేశాయి. విద్యార్థినిని వేధించిన స్రవంతి టీచర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి.

### ఇలాంటి సంఘటనలు మరోసారి జరిగితే కఠిన చర్యలు


కాలు విరిగిన విద్యార్థినిని పరామర్శిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్(ఫైల్)

విద్యార్థినిని వేధించిన విషయమై స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు తెలియడంతో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రమేశ్‌కుమార్‌ను పంపించగా విద్యార్థినులతో మాట్లాడారు. జరిగిన విషయాన్ని తెలుసుకొని గాయపడ్డ విద్యార్థినికి మనోధైర్యం చెప్పారు. స్పీకర్‌కు ఫోన్ ద్వారా విద్యార్థినితో మాట్లాడించగా.. టీచర్లు విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని, అనేకసార్లు తిడుతూ అవమానపరిచారని తెలిపింది. వెంటనే స్రవంతి మేడంను సస్పెండ్ చేయాలని స్పీకర్‌ను కోరింది. అనంతరం టీచర్, ప్రిన్సిపాళ్లతో స్పీకర్ మాట్లాడుతూ.. ఇలాంటి సంఘటనలు మరోసారి జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### స్పీకర్ హెచ్చరించినా..

స్పీకర్ హెచ్చరించిన కొన్ని రోజులకే విద్యార్థినుల పట్ల ప్రిన్సిపాల్ దుర్భాషలాడుతూ కొట్టి అవమానపరిచిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వికారాబాద్‌లోని కొత్తగడి బాలికల గురుకుల పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ సాయిలత ముగ్గురు విద్యార్థినుల మనస్సు గాయపరిచేలా దుర్భాషలాడుతూ వేధించింది. చెంపదెబ్బలు కొట్టింది. అంతేకాకుండా ఓ విద్యార్థిని తల్లిని కూడా బూతులు తిట్టడంతో.. అలా అనవద్దని వేడుకుంటే.. ఎందుకు అనకూడదని పైశాచికంగా ప్రవర్తించింది. మీరు కూలి పనులు చేసుకొని బతుకుతారని అవమానపరిచింది. స్పీకర్ ఆదేశాలను కొత్తగడి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బేఖాతరు చేసిందని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు.


పాఠశాలలో విద్యార్థినులను కొడుతున్న ప్రిన్సిపాల్ సాయిలత(ఫైల్)

### తాను కొట్టి.. తోటి విద్యార్థులతో కొట్టించి..


వికారాబాద్ అనంతగిరిపల్లి సమీపంలో ఉన్న శివారెడ్డిపేట సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల/కళాశాలలో టీచర్ 6వ తరగతి విద్యార్థి యువరాజ్‌ను కొట్టిన ఘటన వెలుగులోకి వచ్చింది. తోటి విద్యార్థులతో కొట్టించి బూతులు తిట్టింది. మార్చి 13న బాబుకు ఆరోగ్యం బాగాలేదు ఇంటికి తీసుకెళ్లాలని టీచర్ చెప్పింది. బాబును తీసుకువెళ్లేందుకు తల్లిదండ్రులు రాగా.. మ్యాథ్స్ టీచర్ తనను కొట్టడమేగాక.. తోటి విద్యార్థులతో కొట్టించిందన్నాడు. ఈ టీచర్ వద్దు.. లేకుంటే తాను స్కూల్‌కు వెళ్లనని స్పష్టం చేశాడు. ఈ విషయమై తల్లిదండ్రులు సంబంధిత టీచర్‌ను ప్రశ్నించగా.. తను చేసిన తప్పును ఒప్పుకొన్నది. అప్పటికే తల్లిదండ్రులు ఈ విషయమై సీడబ్ల్యూసీ చైల్డ్ లైన్‌కు, స్థానిక పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. విద్యార్థి పట్ల దురుసుగా ప్రవర్తించిన టీచర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ తల్లిదండ్రులను, బాబును సముదాయించే ప్రయత్నం చేశారు. చివరకు పోలీస్ స్టేషన్‌లో ఒప్పందం కుదిరింది. మరోసారి ఇలాంటివి చేస్తే టీచర్‌పై చర్యలు తీసుకుంటామని ప్రిన్సిపాల్ హామీ ఇచ్చారు. బాబును సముదాయించి, కౌన్సెలింగ్ నిర్వహించి వారం తరువాత పాఠశాలకు తీసుకరావాలని తల్లిదండ్రులకు తెలిపారు. ఇక నుంచి బాబుకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా తాను చూసుకుంటానని ప్రిన్సిపాల్ భరోసా కల్పించారు.


బాలుర గురుకుల పాఠశాల 6వ తరగతి విద్యార్థి యువరాజ్




## ఎమ్మెల్యే లేడని బియ్యం ఇవ్వలేదు!

- ఢిల్లీ పర్యటనలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి
- నిలిచిన సన్న బియ్యం పంపిణీ ప్రారంభోత్సవం
- ఎప్పుడు వస్తారు.. ఎప్పుడు ప్రారంభించాలో అర్థం కాక తలపట్టుకుంటున్న అధికారులు
- ఎమ్మెల్యే, అధికారుల తీరుపై స్థానికుల ఆగ్రహం


ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తదితరులు

పరిగి, ఏప్రిల్ 1 : ఏప్రిల్ 1 నుంచి ప్రతి పేదవాడికి సన్నబియ్యం ఇస్తామంటూ ప్రభుత్వం ఊదరగొట్టగా.. పరిగి నియోజకవర్గంలో సన్నబియ్యం పంపిణీ ఆదిలోనే హంస పాదులా తయారైంది. రాష్ట్రస్థాయిలో ఉగాది పర్వదినం రోజు హుజూర్‌నగర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏప్రిల్ 1న అన్నిచోట్ల ఆయా జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రారంభించాలని సూచించారు. ఈమేరకు అధికారులు సైతం అన్ని ఏర్పాట్లు చేపట్టి వచ్చిన సగం కోటా సన్నబియ్యం సైతం అన్ని రేషన్ దుకాణాలకు చేరవేసి సిద్ధం చేశారు. కానీ స్థానిక ఎమ్మెల్యే లేకపోవడంతో పరిగి నియోజకవర్గంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం మంగళవారం ప్రారంభం కాలేదు. తెల్ల రేషన్ కార్డు గలవారికి ఒక్కొక్కరికి నెలకు 6 కిలోలు, అన్నపూర్ణ కార్డు వారికి 10 కిలోలు, అంత్యోదయ కార్డుపై 35 కిలోల బియ్యం అందజేస్తారు. నియోజకవర్గంలోని పరిగి మండలంలో 45, దోమలో 34, కులకచర్లలో 30, పూడూరులో 34 రేషన్ దుకాణాలకు 1086 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేయాల్సి ఉండగా స్టాక్ పాయింట్‌లకు వచ్చిన కోటా మేరకు ప్రతి దుకాణానికి కొంత కోటా సన్నబియ్యాన్ని సోమవారం వరకు పంపిణీ చేసి.. మంగళవారం సన్నబియ్యం పంపిణీకి ఏర్పాట్లు చేశారు.

### మంత్రివర్గంలో చోటు కోసం..

ఈ నెల 3న రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ ఉంటుందనే వార్తల నేపథ్యంలో మంత్రివర్గంలో చోటు కోసం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. ఇన్నాళ్లుగా స్వయంగా మంత్రి పదవి కోసం ప్రయత్నించగా.. ఏఐసీసీ నుంచి ఎలాంటి హామీ రాకపోవడంతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యేల్లో ఒకరికి మంత్రి పదవి ఇవ్వాలంటూ ఎమ్మెల్యేలు అధిష్ఠానానికి లేఖ రాసిన విషయం విదితమే. మంత్రివర్గ విస్తరణ తేదీ ఒకటి రెండు రోజులే ఉండడంతో.. రంజాన్ సందర్భంగా పరిగి నియోజకవర్గానికి వచ్చిన ఎమ్మెల్యే తిరిగి ఢిల్లీ వెళ్లారు. నేడు సన్నబియ్యం పంపిణీ ప్రారంభించాల్సి ఉండగా.. ఎమ్మెల్యే వచ్చిన తర్వాతే ప్రారంభోత్సవం చేయాలని జిల్లా ఉన్నతాధికారుల నుంచి అన్ని మండలాల రెవెన్యూ అధికారులకు మౌఖికంగా ఆదేశాలు అందాయి. దీంతో మంగళవారం సన్నబియ్యం పంపిణీ ప్రారంభం కాలేదు. కనీసం బుధవారమైనా ఎమ్మెల్యే ఢిల్లీ నుంచి వస్తారా అంటే సమాచారం లేదని అధికారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సన్నబియ్యం పంపిణీ ఎప్పుడు జరుగుతుందో అని పేదలు ఆశగా ఎదురుచూడడం తప్ప గత్యంతరం లేని పరిస్థితి నెలకొన్నది. కొన్నిచోట్ల రేషన్‌కార్డుదారులు రేషన్ దుకాణాల దగ్గరకు వెళ్లడం, డీలర్లకు ఫోన్ చేసి సన్నబియ్యం ఎప్పుడు ఇస్తారంటూ ఆరా తీయగా.. ఏమి చెప్పాలో డీలర్లకు పాలుపోని పరిస్థితి. ఎమ్మెల్యే వచ్చాకనే సన్న బియ్యం పంపిణీ చేపట్టనున్నట్లు సమాచారం.

## భానుడి భగభగలు

- సమయానికి రాని బస్సులతో ఇబ్బందులు
- ఎండల్లోనే గంటల తరబడి ఎదురుచూపులు

సిటీబ్యూరో, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో బస్సులు అందుబాటులో లేక బస్టాపుల్లో ప్రయాణికులు పడిగాపులు కాస్తున్నారు. మండుతున్న ఎండల్లో సమయానికి బస్సులు రాక నానాయాతనపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బస్సుల ట్రిప్పుల సంఖ్య పెంచి ప్రయాణికులను ఎండ నుంచి రక్షించాల్సింది పోయి.. సిటీ బస్సులను ఇతర జిల్లాలకు తిప్పడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నగరంలో ఉద్యోగాలు, వ్యాపారాల కోసం చాలా మంది బస్సులపై ఆధారపడుతుంటారు. సమయానికి రాని బస్సులతో ఎండల్లో వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రేటర్‌లో 2800 బస్సులు రాకపోకలు సాగిస్తుండగా.. ఇందులో ప్రస్తుతం 2600 బస్సులు నడుస్తున్నాయి. అందులోనూ ఉచిత బస్సు స్కీంతో బస్సులన్నీ రద్దీని తలపిస్తున్నాయి. రోజుకు సుమారు 24 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉగాది, రంజాన్‌కు మూడు రోజులు సెలవులు రావడంతో చాలా మంది పండుగకు వెళ్లినవారు తిరిగి నగరానికి వస్తున్నారు. అటు నగర శివారుల్లోని ఉప్పల్, హయత్‌నగర్, ఆరాంఘర్ తదితర ప్రాంతాల్లో సమయానికి బస్సులు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సులు ఆలస్యంగా నడుస్తుండడంతో కొందరు క్యాబ్‌లను ఆశ్రయించి గమ్యస్థానాలకు వెళ్లిపోతున్నారు.

## కాంగ్రెస్‌ను నిలదీయాలి

- మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- కడ్తాల్‌లో బీఆర్‌ఎస్ నియోజకవర్గ సమన్వయస్థాయి కమిటీ సమావేశం
- ఏప్రిల్ 3న కడ్తాల్ మండలానికి మాజీ మంత్రి హరీశ్‌రావు రాక
- బీఆర్‌ఎస్‌లోకి కాంగ్రెస్ నాయకుల చేరిక

కడ్తాల్, ఏప్రిల్ 1 : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను రేవంత్‌రెడ్డి సర్కార్ తుంగలో తొక్కిందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ నియోజకవర్గస్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్‌నాయక్, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన 420 హామీలను నెరవేర్చాలని కాంగ్రెస్ నాయకులను ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. బూటకపు హామీలు, అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిజ స్వరూపాన్ని ప్రజలు గుర్తించారన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటాలని పేర్కొన్నారు.


కడ్తాల్ మండలానికి గురువారం మాజీ మంత్రి హరీశ్‌రావు రానున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని మర్రిపల్లి గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ, ముద్విన్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దశరథ్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్మించిన ఇంటితోపాటు, చరికొండ గ్రామపంచాయతీలో గల బోయిన్‌గుట్ట తండాలో నూతనంగా ఏర్పాటు చేసిన సంత్ సేవాలాల్ మహరాజ్, మహాత్మా గాంధీ, బీఆర్ అంబేద్కర్ విగ్రహాలను హరీశ్‌రావు ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి హరీశ్‌రావు పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వంపై కాంగ్రెస్ నాయకులకు విరక్తి వచ్చి స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారన్నారు.

మండల పరిధిలోని కర్కల్‌పహాడ్ గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ శ్రీను, బిచ్యానాయక్, బీరయ్య, కృష్ణయ్య, మల్లయ్య, మహేశ్‌తోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారందరికీ ఆయన గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యం, మాజీ జడ్పీటీసీలు, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ ఆమనగల్లు, తలకొండపల్లి మండలాల అధ్యక్షులు, తెలంగాణ బీసీ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, మాజీ వైస్ ఎంపీపీలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, వర్కింగ్ ప్రెసిడెంట్లు, పీఏసీఎస్ డైరెక్టర్ వీరయ్య, నాయకులున్నారు.


బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులకు గులాబీ కండువాలు కప్పుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

## నాడు.. నేడు

బీఆర్‌ఎస్ పాలనలో మత్తడి దుంకుతున్న జుంటివాగు



కాంగ్రెస్ పాలనలో 1 ఏప్రిల్ 2025న ఖాళీగా ఉన్న జుంటివాగు



## నాడు నిండుగా.. నేడు ఖాళీగా..

బీఆర్‌ఎస్ హయాంలో మండుటెండలో సైతం జుంటివాగులో నిండుగా ఉన్న నీరు.. ఇప్పుడు ఖాళీగా కనిపిస్తున్నది. యాలాల మండల పరిధిలోని జుంటివాగు వద్ద నీళ్లు పోకుండా వాగు ఆనకట్టకు పాలకులు, అధికారులు మరమ్మతులు చేయించకపోవడంతో వాగులో నీళ్లు కానరావడంలేదు. దీంతో బోరు బావులు వట్టిపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. పశువులు తాగడానికి నీళ్లు లేక అల్లాడిపోతున్నాయి. - తాండూరు, ఏప్రిల్ 1